# విశాఖ కనక మహాలక్ష్మి

అన్నాళ్ళనుంచీ విశాఖపట్నంలో వుద్యోగం చేస్తున్నా. నేను సింహాచల క్షేత్రం మెట్లెక్కలేదు, వూళ్ళోవున్న గ్రామదేవత – కనకమాహాలక్ష్మి గుడినీ చూడలేదు. పిన్ని వచ్చి పరిస్థితిని మార్చివేసింది.

స్టేషనులో దిగుతూనే "అదేమిట్రా చిన్నా. వాల్తేరు అని బోర్డు పెట్టారు. ఇక్కడేనా నీ వుద్యోగం?" అని ఆశ్చర్యపోయింది.

"విశాఖపట్నం, వాల్తేరు అంతా ఒకటే పిన్నీ. విశాఖకు వేరే స్టేషను లేదు."

"మరి సింహాచల నరసింహస్వామి దర్శనం ఎప్పుడు చేయిస్తావురా?"

"ముందు కొంచెం విశ్రాంతి తీసుకో పిన్నీ తీరిగ్గా వెళ్దాం" అని నేను సర్ది చెప్పాను.

"తీరికా నాబొందా. మీ బాబాయికి నేను బయలుదేరే సరికే సుస్తీగా వుంది. అక్కలిద్దరూ బెంగపెట్టుకోర్రట్రా. రిక్షాలు మాట్లాడు" అని తొందర చేసింది.

ఆఫీసువాళ్ళను మంచి చేసుకొని నేను తెచ్చుకొన్న జీపుతోనే, ఆ పుణ్యక్షేత్రాన్ని పిన్నికి చూపాను. దర్శనమైనాక అక్కడి అరటి తోటలు, కొండ సంపెంగి చెట్లు, పనస వృక్షాలు, కొబ్బరి తోపులు, అనాస పొదలూ చూసి చాలా ఆనందించింది. కప్ప స్థంభాన్ని ఆలింగనం చేసుకొని కన్నీళ్ళు కార్చింది. ఎందుకో నాకు తెలుసు. నా 'కజిన్ సిస్టర్స్' అంటే పిన్ని యిద్దరు కూతుళ్ళకు యింకా వివాహాలు కాలేదు. నాకే పాతికేళ్ళు పైబడ్డవి. కజిన్స్ యిద్దరూ నాకన్నా పెద్దవాళ్ళు, కొండ కింద తాగిన కొబ్బరి బొండం నీళ్ళు మినహాయించి ఆ దినమంతా పిన్ని వుపవాసమున్నట్టే.

ఆ మర్నాడు నేను ఆఫీసునించి తిరిగి వచ్చేసరికే, ఇంటి పొరుగు వడ్డాదివారి అమ్మాయితో కనక మహాలక్ష్మి గుడికివెళ్ళి వచ్చింది పిన్ని.

"ఎంత అపరాధం జరిగిపోయిందిరా చిన్నా. మొదట గ్రామ దేవతను దర్శించకుండా వేరే తీర్థాలకు వెళ్ళిరావచ్చా?" అని నెపం వేసింది.

"కొండమీది నరశింహ్వామూర్తి గోదావరి మండలం నుండి ఉత్త రాంధ్ర, కళింగాంధ్ర దేశాలన్నింటికీ అధినాధుడుగదా. నీకా అనుమానం రాగూడదు" అన్నాను నేను.

"ఏమోరా. ఆ మహాతల్లిని మన్నించమని ప్రాధేయపడ్డాను. నా కోరికలు తీరిస్తే అయిదు శుక్రవారాలు కొబ్బరికాయలు కొట్టిస్తానని మొక్కుకున్నారా" అని మళ్ళీ కన్నీళ్ళు పెట్టుకొంది.

ఆ మర్నాడే బయలుదేరి వెళ్ళిపోయింది. ఎంత ఓపిక. ఆ తరంవాళ్ళకి? గుంటూరు భక్తబృందంతో బయలుదేరి, పూరీజగన్నాథంలో

మాఘపూజలు, సముద్ర స్నానాలు ముగించుకొని, యాత్రలో ఒక్క దినంగూడా విశ్రాంతి లేకుండా మళ్ళీ వరాహనరశింహుణ్ణి, కనకమహా లక్ష్మిని నుతించి, తనకోసం కాకుండా తనవాళ్ళ క్షేమాన్నాసిస్తూ పయనం సాగించగలిగిన పిన్ని ఆధ్యాత్మిక శక్తి, ఆ కోవలోచేరని నన్ను గూడా కదిలించి వేసిందనుకొన్నాను. నిదర్శనం దొరికితే జాబు రాస్తానని చెబుతున్న పిన్నికి వీడ్కోలు చెప్పాను.

నిదర్శనం నావంటివాళ్ళకు కనిపించదుగాని పిన్నివంటి అమాయకులకా? పెద్దక్క యిక వృద్ధకన్య కాబోదు—సంబంధం కుదిరిందట. "నా మొక్కు తీర్చే బాధ్యత నీది-" అని నిజంగానే జాబువచ్చింది. ఆ శుక్రవారంనాడు కనక మహాలక్ష్మి గుడికి నేను బయలుదేరటం మరెందు కనుకొన్నారు?

ఎక్కడో కాదు, నేను తరచుగావెళ్ళే హిందూ రీడింగ్ రూం వెనకనే కనుగొన్నాను - కనకమహాలక్ష్మి దేవిని. కొంచెం ఆశ్చర్యం కలిగినమాట నిజం. మందిరమూ లేదు. కనీసం ఆచ్ఛాదన గూడాలేని చిన్న ప్లాట్ఫారం మీద, చుట్టూ కటకటాల మధ్య, కళింగ శిల్పశైలిలో ఇరవై గజాల దూరాన ఆమె మూర్తి.

వీధి పెద్ద వెడల్పూలేదు — రెండు పార్శ్వాలా కొబ్బరికాయలు పరచుకొని చిన్న చిన్న దుకాణాలు. మొదటి రెండు మూడు బడ్డీలు దాటి, ఆగి, "కొబ్బరికాయ ఎంతవ్వా?" అంటూ జేబులోచెయిపెట్టి, ముందున్న పెంకుటింటి స్తంభంచూస్తూ అట్లాగే నిలబడిపోయాను. మద్రాసులో వుండగా యిటువంటి ఒకటిరెండు అనుభవాలు జీర్ణించుకొన్న వాడినే అయినా, ఆంధ్రదేశంలో తోడిమనుష్యుడి జేబులు కొట్టేస్తారా, అసంభవం - అనే వేదాంత ధోరణికి అలవాటు పడ్డవాణ్ణి.

"ఏటిబాబూ, అలాగే నిలబడి పోయినావు?" అని దుకాణం మనిషి అడుగుతున్నది.

"పర్సు పోయింది..." అని మళ్ళీ హిప్‌పాకెట్ వెతుక్కున్నాను.

"చిటీలో వచ్చినావ బాబూ?"

"అవును, సిటీ బస్సులోనే"

"యాడికెళ్ళి చిటీ ఎక్కినావుబాబూ?"

"అక్కయ్య పాలెంలో...."

"పొన్నూరు బాబునాగున్నావు. పైవూరేనా బాబూ?"

అవును, పరాయివూరే, నా మాటలు పట్టిస్తున్నాయిగదా.

ఈ విషయంలో గూడా నాదొక వేదాంత సూత్రం వున్నది. భాష - రెండంచుల పదునుకత్తి. మనుషుల మధ్య మమకారం కూరుస్తుంది. ద్వేషమూ రగుల్కొలుపుతుంది. మద్రాసులో "ఎడమిల్లైయ్... గోబాక్ కోంగూర" అనే నినాదాలు గోడల మీద చదివాను. నా వీపు వెనక అంటూండగా విన్నాను. అటునుండి "జాగనహిహై, గోబాక్ ఆంధ్రా" వుద్యమాన్ని గూడా హైదరాబాద్‌లో చూశాను. రాజకీయాధికారం కోరిన భూస్వామ్యవర్గం, గవర్నమెంటు వుద్యోగాలకోసం యన్.జీ.వోలు - యీ రియాక్షనరీ వుద్యమాలు లేవదీశారని చరిత్రకారులు చెబుతున్నారు. కాని నేనంటున్నది సామాన్యుల సంగతి. నాయకులూ, పత్రికలూ, వార్తలూ, అసెంబ్లీలు, పార్లమెంట్లూ ప్రతి నిమిషమూ, వుగ్గడించే "సగటు మనుషుల" సంగతి. వీళ్ళకేగదా రెండంచుల కత్తితోపని ప్రతినిమిషమూ. ఎవరెవరి పూర్వీకులు ఏయేప్రాంతాల నుండి వలసలు వచ్చారో, పొయ్యారో. ఏ రాజకీయ, ఆర్థికవత్తిడుల వల్ల వీళ్ళంతా వేర్వేరు పరిపాలనా వ్యవస్థల్లో స్థిరపడిపోయారో—వాళ్ళకు ఆ ద్వేషానలంలో కనిపించదుగదా. ఈ ఆలోచనలు వచ్చినందున, కొంచెం కోపంగానే అడిగాను.

"ఏం, పొన్నూరు వాళ్ళందరూ పాపిష్టులేనా?"

"నేనలాగన్నేదు బాబూ, నానూ పొన్నూరుగుంటనే గందా. వైజోగళ్ళ మాయలు పైయూరోల్లకెలా ఎరికయితాది బాబూ"

"అప్పుడు చూశాను - ఆమెను. ఆక్షణంలోనే నేను కొత్త

చిక్కుల్లో తలదూరుస్తున్నానని మాత్రం - ఎలా అనుకోను! ఆ శాంత సాధుమధురమైన స్వరం విన్నాక నా కోపానికి అర్థంలేదనిపించి సిగ్గు పడ్డాను.

"కూకోండిబాబూ. అలాగ నిలబడిపోయారు"

జాజిచెక్కల పెట్టెమీద తేలిగ్గాకూలబడ్డాను. శుక్రవారం సాయం సమయం గనక కనకమహాలక్ష్మి చుట్టూ వందమంది స్త్రీలయినా వున్నారు.

ఆమె వెదురుబుట్టలో కొబ్బరికాయ, కాసినిపూలు, పసుపుకుంకుమ పొట్లాలు, అగరుబత్తీల జోడు - చకాచకా అమరుస్తున్నది. వచ్చిన వాళ్ళకు బేడా పరకా అటూ ఇటుగా బేరాలు చెబుతున్నది. నేనైతే ఆమె వయసును అంచనా వేస్తున్నాను. ఇరవై - ఇరవై ఐదేళ్ళ మధ్య ఏ సంఖ్యాయి వుంటుంది? అంత పెద్దకళ్ళకు ఆ కాటుకెందుకు పులుము కొన్నదో. అంత చిన్ననోరు, సంపెంగి ముక్కు, ప్రబంధాల మాటలు నాకురాక అట్లా అనుకొంటున్నానేమో. కుదిమట్టసమైన ఆ నల్లనిదేహానికి అంతముదురురంగు చీరె నప్పుతుందా? దగ్గిరసా చూస్తేగాని ఆ అందం కానరానట్లున్నది.

"కాయ కొట్టరేటి బాబూ. అలాగే కూకుండి పోయారు?" అని నా వడిలో పూజాద్రవ్యాల జల్లెడ పెట్టింది.

నేను కొంచెం ఉలిక్కి పడ్డాననే జ్ఞాపకం.

"నా దగ్గిర - యింకేం డబ్బులేదు" అన్నాను.

"పర్లేదుబాబూ. తల్లి మొక్కు తీర్చుకోవా?"

"ఎవరూనమ్మరు, నువ్వెందుకునమ్మి యిస్తున్నావో. రేపు తెచ్చిస్తాను"

"మొకాలు చూస్తే తెలీదేటి బాబూ, అలాగంటారు. పర్నేదు. అమ్మగారు రాలేదేటి? మొక్లీసులా?"

మొక్లీసు పదం వినని పదం. అర్థం కాలేదు.

"బేచిలరోల్లా అంటున్నా"

అవును బేచిలరోణ్ణే.

"బేగి యెల్లిపోరా బాబూ, దుకాణం కట్టేసి సినిమాకుపోవాలి. ఆ జల్లి ఇంకోజాగాలోయిచ్చిగట్రలు. నా పేరు మల్లీశ్వరి."

జ్ఞాపకం వుంటుంది. మల్లీశ్వరి.

"నేను ఎంత "బేగియెల్లిపోయిరా" వాలనుకొన్నా ఇరవై నిమిషాలు పట్టింది.

జల్లివాపసు చేస్తూంటే, ఆ దుకాణం వెనకే, అల్లంత దూరాన నిలబడి పొట్టినిక్కరూ, కాలరుచొక్కా, మీసాలులేని గుండ్రని ముఖం, నోట్లో బీడీ పొగవదులుతూ ఒక యువకుడు నా వంక చూస్తున్నట్లు గమనించాను. ఎక్కడో చూసిన ఆనవాలు. బస్సులోనేమో గుర్తు రావటం లేదు.

జల్లి అందుకొని "అయిదు రూపాయలు బాబూ" అంటూ మల్లీశ్వరి నాకు దాన్నే అందించింది.

నా పోయినపర్సు అందులో ఉంది! ఆ జల్లిలో!!

మా యింట్లో అందరూ నన్ను తెలివితక్కువవాడికిందే జమ కడ్తుంటారు. నా స్నేహితులుమాత్రం నావూహల్ని మెచ్చుకొంటుం టారు. పరికించి నావూహ కరెక్టేనా - అని చూడబోయాను. ఇందాకటి హీరోగాడు మాయమై పోయాడు.

పర్సుమందం తగ్గలేదు. 'మల్లీస్వరి' సర్దుకొంటూన్నది.

అయిదు రూపాయల నోటందిస్తూ – "ఏమిటిది?" అని తీక్షణం గానే ప్రశ్నించాను.

"కనకమాలచ్మి తల్లిమాత్యం అనుకో బాబూ. ఎంచుకో బాబూ. పైపూరోల్లం. మన కేల-యీమాయలన్నీ-ఆలీసం అయిపోనాది. యేగిరం సిలిమాకెల్లాలి-" అంటూ కొంతదూరం సాగి "అయిదు చక్రాల మొక్కుగాదు బాబూ!" అని అడిగి నా ముఖంలోకి చూసింది.

"అవును. ఐదువారాలు. ఆ జేబు దొంగకు, యీ మల్లీస్వరి ప్రేయసి అయి వుండొద్దామరి. ఈ టెంకాయల వ్యాపారం యీ రిఫ్‌రాఫ్ గాళ్ళకు ఒక ఫ్రంట్ అన్నమాట. మరి నాపర్సు ఎందుకిచ్చేసింది? దాదాపు మూడొందలు. వైజాగ్ సిటీ లంపెన్ ఎలిమెంట్సును గూర్చిన కథలు యిదివరలో చాలా చదివే వుంటారు. నాకైతే ప్రత్యక్షానుభవం. ఇంకొక అనుభవం గూడా. విశాఖలో పూర్ణామార్కెట్ చాలా ప్రసిద్ధి గదా. కూరలు, పళ్ళు, కిరానాదినుసులు, చేపలూ, కోళ్ళూ గుడ్లూ, ''బేరం'' చేస్తే, బూతులు, తిట్లూ అన్నీ ఒకే చోటలభించే సెంట్రల్ స్టేషన్. మొన్న వేసంగిలో మామిడి పళ్ళకోసం వెళ్ళినప్పుడు పెద్ద రసాలు డజను పన్నెండు రూపాయలన్నది. తీరా డబ్బివ్వబోతే నేనన్నది పద్దెనిమిది, పన్నెండుకాదు అని పేచీ పెట్టింది. మెడలో కె.జి. బంగారం. నోటితో పునరుక్తంగాని వంద బండ మాటలు. పండ్లు వాపసు తీసుకోదు. చివరకు పైవూరు బాబువి. మాట తెలీదు" అని తనే మధ్య వర్తిత్వం చేసి పదిహేను రూపాయలు వసూలు చేసింది. పైవూరు వాడికి అది కన్సెషనల్ రేటు. ఇక్కడ మల్లీస్వరి-కనకమహాలక్ష్మి మిరకిల్ అంటున్నది. పైవూరంటే ఎందుకీ జాలి. అబద్ధపుజాలి?

* * *

మొక్కు చెల్లిస్తున్నానని పిన్నికి వినయంగా జాబు వ్రాశాను. ''క్రమంతప్పకు నాయనా"-అని పిన్ని ఆశీర్వదిస్తూ హెచ్చరించింది. ముహూర్తాలు కుదుర్చు కొంటున్నారట. నేను పెళ్ళికి తప్పక హాజరు కావాలి.

ఆ పై వారం, సాయంత్రం రష్‌లో కుదరదని ప్రత్యేకంగా సెలవు తీసుకొని వుదయమే కనకమహాలక్ష్మి మొక్కుకు వెళ్ళాను. సందడి ఎక్కువగానే వుంది. మల్లీశ్వరి కొట్టు తప్పించి ముందుకు పోతున్నాను.

''ఏటి బాబూ, మల్లీస్వరిని మరిసినా రేటి?'' అని నిలేసి పూజా ద్రవ్యాలందించి-'' అలకించు బాబూ, ఆడ-ఖాకీ నిక్కరేసుకొని జమాను నిల్చినాడుగదా. ఆడికి నా పేరు సెప్పీసీయండి. యేగిరం కాయ కొట్టేసిస్తాడు''- అని సూచన చేసింది. తప్పలేదు. ఐదు కాయితం తీసికొని పావలా వాపసు యిచ్చేసింది. ఇక నేనేం మాట్లాడేది? అయినా పోతూ ఒక బాణం విసిరాను- ''మల్లీశ్వరీ, యివ్వాళ నేను బస్సులో రాలేదు''

''బాబ్బాబు, అలాగనకు'' అంటున్న తన మాటలకు వెనుదిరగకుండానే వెళ్ళిపోయాను.

వెళ్ళిపోగలిగానుగాని యీ అనాహూత పరిచయం నన్ను వదిలిపోవటంలేదని రెండు మూడు రోజుల్లోనే తెలుసుకొన్నాను. ఎన్నాళ్ళనుంచో ఎదురుచూస్తున్న నా ట్రైనింగ్ ప్రోగ్రాం, మళ్ళీ ఏ రెండేళ్ళకో గాని లభించని అవకాశం ఆఫీసుకెళ్ళగానే తెలిసింది. పరిమితి రెండు వారాలే అయినా వుత్తరోత్తరా నా కేరీర్‌కు చాలా వుపయోగపడే అవకాశం అది.

గురువారమే, రాత్రి బండికి హైదరాబాదు వెళ్ళిపోవాలి సంతకం పెట్టానుగాని, నాన్నగారుపోయాక రెండేళ్ళు నన్ను కాలేజీలో చదివించిన పిన్ని మాట నిలబెట్టుకోవద్దా? రేపే శుక్రవారం. మా యింటివాళ్ళు బ్రాహ్మో సమాజీకులు - అంటే విగ్రహారాధనకు వ్యతిరేకులు- ఇంకా తెలిసిన రెండు మూడు కుటుంబాలవారు - ఒకరు క్రిష్టియన్లు. ఇంకొకరి దగ్గర నేను పెద్దరేషనలిష్టు - అంటే హేతువాది అంటారా?- అనే శుష్క-ఇమేజ్‌ని వాగ్వాదాల్లో పెంచుకొన్నాను. ఇక తప్పక మల్లీశ్వరికే బాధ్యత అప్పగించాల్సి వచ్చింది.

''మతిమరుపయిఁదేటి బాబూ. ఈ పొద్దు బేస్తారంపొద్దు'' అన్నది.

"నిజమే, కాని - నేను యీ రాత్రికే పనిమీద పొరుగూరు

వెళ్తున్నాను. రేపూ, ఆపై శుక్రవారం నువ్వే మ్మా మొక్కు తీర్చాలి, మల్లీశ్వరీ'' అని అడిగాను.

"మల్లి - అంటే సాలుబాబూ. మరి తక్కువోళ్ళం. నాను కొడితే పనికొస్తాదా బాబూ?"

''దేవుడికి మనుషుల పట్టింపులుండవ్. మనస్ఫూర్తిగా చేస్తేచాలు ఐనా నువ్వా ముదురురంగు చీరెలు మారిస్తే పెద్దింటి ఆడబడుచువే నంటారు మల్లీశ్వరీ" అని నా చొరవకు నేనే మెచ్చుకొంటూ అనేశాను.

ఆమె ముఖం విప్పారటం గూడా చూశాను, నన్ను ఆరాధనా భావంతో చూసిన చూపుగూడా గమనించాను.

''అనాగా బాబూ. ఈ రంగు కేటొచ్చిందంటావు?" అని ఏక వచనం.

''ఏమో తెలీదుగాని, తేలికరంగైతే యింకా బాగుంటావు. డబ్బు యింద''

''పర్నేదు-పర్నేదు-పైవూరెల్తే అక్కరకొస్తాది.యెలిపోయొచ్చాక యియ్యి బాబూ'' అన్నది.

"అక్కర్లేదు- నాకేమీ యిబ్బంది లేదు''- అని పదిరూపాయల నోటందించాను. అయినా యింకోబాణం వదిల్తేనే మంచిదనుకొని- ''మొన్న నా పర్సు చూడ్లేదా? డబ్బులెప్పుడూ వుంటై" అని ముగించాను.

కొంచెం తొట్రుపాటు పడ్డది.

''నాను లెక్కెట్టినానా. మీ సొమ్ము. పేరు సెప్పకనే పోతిరి''

మా పిన్ని పేరు చెప్పి పదడుగులు వేశాకగాని, నా వెనక ఓ మనిషి వస్తున్నట్లు గమనించలేదు. వాడేహీరో. పిక్‌పాకెట్. మలుపు తిరుగుతుండగా అడ్డం వచ్చాడు-. గమనించనట్లే స్కూటర్ తాళాలు పైకి తీసి రీడింగు రూము వైపుకు తిరిగాను. వాడి మొదటి బెదిరింపు మాటలు గూడా నావేపే తిరిగినాయ్.

''ఓ స్నోస్...ఆ గుంటతో సరసాలాడకు. వంటికి మంచిది గాదు" అంటున్నాడు.

కొన్ని వేదాంతసూత్రాలు అలవర్చుకొన్నవాణ్ణని చెప్పానుగా. రౌడీగాళ్ళకు భయపడితే వాళ్ళకు మనం నరవాహనాలవుతాం అని నా అనుభవం.

"ఎవడ్రా నువ్వు?" అని కళ్ళెర్ర జేశాను.

"తెలీదా? రమణగాడంటే తెలీనోళ్ళుండరు పోలీసుల్తో సహా-బరంపురం నుంచి నెల్లూరుదాకా తిరిగిన బాపతు కాజోలు, విశాఖ యాస అంతగాలేదు.

''అయితే-?"

"రంగపోణ్ణి. అర్థమయిందా? బరమా ఎవాక్యూని. ఆ గుంటతో నీకేటి యేలాకోళాలు?"

"నువ్వు రంగూన్ రౌడీవైతే నాకేం? లండన్ ఎవాక్యూవైతే నాకేం? నా జేబు కొట్టేసిన వాడివని నాకూ తెలుసు. నీకేమవుతుంది? కట్టుకొన్న వాడివా?"

అది చీకట్లో బాణం. నా సూత్రమూ పనిజేసింది తార్కాణంగా ఆత్మవిశ్వాసం లోపించినవాడి మాటలు మళ్ళీవినగలిగాను.

"కట్టుకోవాలేటి? నా దరిజేరింది నా గుంట. బారకాసుమని షనుకొంటివేమో. జెల్లలు తినగలవ్" డైలాగులు.

పోలీసు పాతబారక్సు రోడ్డులో తిరిగే వ్యభిచారిణికాదు అని చెబుతున్నాడు - మీరూ గ్రహించే వుంటారు. రెండుతగిలిద్దామా - ఆ చివరి మాటలకు అనుకొని గూడా, మర్యాదస్తుల కీడెంచి మేలెంచు సూక్తిని స్మృతికి తెచ్చుకొని, విరమించి.

"ఒరే, రమణా. నువ్వు పరమమూర్ఖుడివని తెలిసిపోతూనే వుంది. మల్లీస్వరి చాలా వుత్తమురాలు. ఆమె ముఖంచూసి వదిలేస్తున్నాను. నా సంగతిగూడా విను. సొంత మేజిస్ట్రేటు పనిచేస్తాను. మళ్ళీ బస్సులెక్క-

లేవు. విను. నేను సరసాలాట్టానికి రాలేదు. దేవతకోసం వచ్చింది. ఇకపో" అన్నాను. నా గొంతు కరకుతనం - కొత్త విశేషంగా నాకే వినిపించింది. సూత్రం - ఆచరణలో గూడా నిలబడ్డది గనక సోషల్ సైంటిష్టుల్లో నా పేరూ వ్రాసుకోవచ్చు అనుకుంటూ స్కూటరెక్కి పోయాను. పోయానుగాని, బండి మళ్ళించి మల్లీస్వరికి యీ సంగతి చెప్పకపోవటం పొరబాటేమోననే అనుమానంతోనే. అంత బలంగా, నేను డిఫెండు చేసిన మల్లి అంత వుత్తమురాలేనా అని గూడా తోచిందేమో - వెనుదిరగలేదు. ట్రైనింగులో జ్ఞాపకమూ తెచ్చుకోలేదు.

*　　　　*　　　　*

తిరుగు ప్రయాణంలో పిన్నిని చూడబోయాను - ట్రైనింగు సంగతి చెప్పి ఆమెను నిరుత్సాహపరచటం సబబనిపించక విశాఖ మాటలే మాట్లాడుతుంటే - "నీ గుండె ఎంత నిర్మలమైందిరాచిట్టీ. నీకూ భక్తీ, గురీ కుదిరిందంటే ఆ తల్లి ఎంత చల్లని మనసురా" అని ఆమె దిష్టితీసేస్తుంటే, మల్లీస్వరి క్రమం తప్పలేదని పూజ చేసిందని తోచింది. అక్క సంతోషం, ఏమని చెప్పేది? కట్నం కోరని వాడు, పురుషలక్షణమైన వుద్యోగం వున్నవాడు కుదిరాడు. పైనెలలోనే ముహూర్తం. "కల" పండటమంటే యిదేగదా.

శుక్రవారం ఉదయానికే విశాఖచేరుకొని, ఆఫీసులో రిపోర్టిచ్చి, సాయంత్రం పిన్నిమొక్కు ఆఖరి వాయిదా తీర్చేస్తే కొంత రుణమైనా తీరిపోగలదనే తృప్తి పడ్డప్పుడు - రమణా, మల్లీస్వరి ముందు నిలిచినట్లయి వులిక్కి పడ్డాను. ఎంత అపవిత్రురాలికి పిన్ని భక్తిని అప్పగించాను. అని మధనగూడా అంకురించినప్పుడు, పర్సు తిరిగిచ్చిన మల్లిముఖంలో ఆ అపవిత్రత నేనెందుకు చూడలేక పోయానో అర్థం కాక - ఆలోచనల నన్నీదాటవేసి, సాయంత్రం శుచిగా స్నానంచేసి, స్కూటర్లో పెట్రోలు పోయించుకోవటం ఆలస్యమవుతుందని రిక్షాలో గుడిచేరి, బోసికొడ్తున్న మల్లీస్వరి బడ్డీకొట్టు చూశాను. మనిషిలేదు.

అనుమానంగా పరికిస్తున్న పక్కబడ్డీ మనిషి వద్దే మూడు టెంకాయలు, పూజావస్తువులు కొని యీ సారి వందనసమర్పణతో, క్షమాపణలు కోరుకొని - నన్ను గురించిన మా యింట్లోవాళ్ళ అంచనా నిజమేనను కొంటూ బయటపడ్డాను.

ఎదురుగా మల్లినిలిచివున్నది. చేతిలో వాడి నల్లకిలుంపడ్తున్న రెండు కొబ్బరిచిప్పలూ, అర్ధరూపాయికాసూ, ముఖంలో దైన్యం, కళ్ళలో సగం నిండుకొన్న నీరు.

"పొద్దుట చూశాను బాబూ. ఇప్పుడెలాగూ యెలిపోయిరాగలనని పడివచ్చినాను బాబూ. తవరిమొక్కు తీర్చినాను."

సంచీలో కొబ్బరిచిప్పలు పడేసి - "ఏమైంది మల్లీస్వరీ" అని ప్రశ్నిస్తున్నప్పుడుగాని, ఆమె తేలికరంగు చీరెలో కొత్తగా కనిపించటం గమనించలేదు. ఆ సొగసు బాహ్యంకాదు. ఆంతరంగిక సౌందర్యం. జాలితోనో, మోహంతోనో, కృతజ్ఞతా భావంతోనో ఆ నిరక్షరకుక్షిని చేతుల మధ్య పొదివిపుచ్చుకొని ఆదరించగలనా - అందరి మధ్య?

"రిక్షాఎక్కు" అని ఎట్లా అన్నానో, అంత నిస్సంకోచంగా నా పక్కన కూర్చొన్నది.

దీపాలవేళ.

"తిన్నావా?"

లేదన్నట్లు తల ఆడించింది.

హోటల్ మేడమీద కాబిన్‌లో కూర్చొని, ఆవేశ కెరటాలను పక్కకు తోస్తూ అడిగిన ప్రశ్న :

"మల్లీ నువ్వు చదువుకోలేదా ?"

నా వంక వింతగా చూసింది.

"తొమ్మిది వరకూ."

"మరి ఆ మాట తీరేమిటి?-

"బాబుగారూ. ఎవరిమధ్య నేనుంటున్నది? వాళ్ళతో పోజులు

పెడ్తే దినాలెళ్ళుతాయా?

యాసలేని పలుకులు. బ్రతకనేర్చిన సత్యాలు.

"రవణవంటి లుచ్చాను ఎందుకు చేరదీశావు మల్లీ"

నా అమాయకత్వానికి జాలిపడ్తున్నట్లుగా చెప్పింది.

"అడివిలో తీగెలు మొలుస్తాయి. తీగెకు మాను అందలేకపోతే గొడ్డూగోదా మట్టియవా బాబూ. రవణగాడు లేకుంటే నా బతుకు బండపాలు కాదా? ఆడదాన్ని బతకనిస్తారా బాబూ. యిది ఆడివి బాబూ"

తినటం మాని ఏడుస్తున్నది. నాకున్నట్లే మల్లీస్వరికి ఎన్నో వేదాంత సూత్రాలున్నవని అర్థమయింది.

"ఎందుకేడుస్తావ్?"

"అణ్ణి బొక్కలో తోసేసినారు బాబూ. సినీమాల కాడ బ్లాకు అమ్ముతుంటే మాన్పించినాను. జేబులు కొడ్తూంటే దెబ్బలాడి మాన్పిచ్చేసినాను. మనం యేపారం నడుపుకుందామని నచ్చ చెప్పినాను. అన్నిటికి ఒప్పేసుకుంటాడు. సాయంత్రమయ్యే సరికి దయ్యం పట్టి పోతాడు. నంబర్ల ఆట—ఆడందే ఆడకి నిద్దరుండదు బాబూ. హార్బారు కాడ దొంగలగుంపులో పట్టేసినారు. ఆడికైతే అంత దయిర్నం లేదు బాబూ"

"అంత పిరికివాడయితే నన్ను బెదిరిస్తాడా?"

మల్లీస్వరి నాకు ఏదో నిగూఢసత్యం విడమరిచి చెప్పాలన్నంత ఆత్రుతతో కుర్చీలో కదిలింది.

"తెలుసుబాబూ. ఎరికయింది. తిట్టినాను. తిమ్మినాను. మగాళ్ళతో నోరిప్పితే - ఆడికి నానంటే...."

"జెలసీ అంటార్లే" అన్నాను.

"కామోసు బాబూ. నామీద ఈగవాల్నీడు"

నా ఆలోచనలు పరిపరి విధాలుగా దార్లుతీస్తున్నవి.

"మల్లీ. నాకు తెలుసు. కొబ్బరికాయలన్నీ అమ్మేసుకొని రవణ కోసం ఖర్చు పెట్టేసుకొన్నావు గదూ?

మాట్లాడలేదు. చివరికన్నది: "ఆడికి జామీ నొగ్గగలననితల పోసినాను. పనికానేదుబాబూ!"

"ఒక పనిచెయ్యి. నీకు జరుగుపాటు వద్దా?".

"తమరొస్తారని నమ్మకం వుంచాను బాబూ. కనకమ్మతల్లి అనెత్తం పలకదు"

పర్సుతీసి రెండుమూడు నోట్లుతీశాను.

"మళ్ళీ దుకాణంలో సరుకుకు ఎంత కావాలి?

గుణించింది. "నూటయాపై అవుతాది బాబూ"

ఇచ్చివేస్తూ అన్నాను. "రమణ బెయిలు గురించి విచారిస్తాను. నీకే సమాచారమూ ఎల్లుట చెప్పగలను"

మల్లి నేను సాగిపోతూంటే ఆపి అన్నది.

"బరమా వోణ్ణని, రంగంపోడినని యెచ్చులు కూసినాడుగదూ బాబూ"

"అవును"

"కాదు బాబూ. ఆడికి డాబులెక్కువ. ఆడిదీ యిజీనగరం కాడ పల్లె. సినిమాలు చూసి వురికొచ్చినాం. మాది అనికాపల్లికాడబాబూ"

"మరింకా యింత నేర్చుకొనీ సినిమాలు వదల్లేదుగా"

"మరేటి సెయ్యం బాబూ" అన్నది అతి సాధారణమైన మౌలిక సమస్యను యిట్టే విప్పివేస్తూ.

మళ్ళీ ఆపింది. "మీ మాట మీన చీరెలు మార్చేసినాను"

ఇందాకనే చూశాను. ఆ దుఃఖంలోనూ, నైరాశ్యంలోనూ ఆమెకున్న జీవితాశ నాకెట్లా అబ్బుతుంది? అబ్బదు. ఏమీ మాటాడలేక - "నువ్వాయాసతో మాట్టాడితే నేనూరుకోను" అని వెళ్ళిపోయాను.

నాకు ప్రమోషనూ వచ్చింది. బదిలీ గూడా వచ్చింది. వారం

గడువున్నది. ఆ తర్వాత అక్క పెళ్ళి ముహూర్తం.

*  *  *

మూడు రోజులగ్గాని పనులు తెమలలేదు. బడ్డీముందు మల్లీస్వరి మామూలుగా బేరం చేసుకొంటున్నది. కొబ్బరికాయ అందించబోయింది.

"తర్వాత ఆపని. ముందు ఆలకించు. రవణ బెయిలుకు ఏర్పాటు చేశాను. కాని వాడికి శిక్ష తప్పదు, కనీసం రెండు నెలలైనా పడ్తుంది. యీ అడ్రెసు దగ్గిరకి వెళ్తే ప్లీడరుగారు గుర్తిస్తారు. రేపో ఎల్లుటో బెయిలుమీద విడుస్తారు. ఇక నుంచైనా వాణ్ని అదుపులో పెట్టుకో"

మల్లి అవాక్కయి చూసింది. "తమరు తమరు"

"తమరిక్కడుండరు. బదిలీ అయిపోతున్నాను"

కొబ్బరికాయందుకొని - "బెయిలుటైములో పారిపోడుగదా?" అని అడిగాను.

మాట రాలేదేమో, స్తంభం నీడలోంచే చెప్పింది.

"పోడు, నన్నిడిచి పోలేడు బాబూ"

"మంచిది, వస్తాను"

"మరి తమరి డబ్బు - మనేద్దరు చేసీనా?"

"చేద్దువుగాని. ఇప్పట్లో కాదుగదా. మళ్ళీ నేనెప్పుడైనా విశాఖ రాకపోతానా?" అని యిక ఆగలేదు.

మల్లీశ్వరికి నా పలుకుల్లో అసందర్భం గోచరించి వుండవచ్చు. అయినా, నాకు సంతోషంగానే వుంది.

మర్నాడు స్కూటర్ రైల్లో బుక్‌చేసి హోటల్లో తిని ఆలస్యంగా గది చేరాను. మల్లీశ్వరి గడపలో కూర్చొని వుంది- చాలా పొద్దు పోయింది. రాత్రి పది గంటలు.

"ఏమిటిది? రవణ వచ్చాడా?"

"రేపు మద్దినాలకు వదుల్తారంట బాబూ"

తాళం తీసి గదిలోకెళ్తుంటే తనూ వచ్చింది.

"ఈ సంగతి చెప్పటానికా యింత పొద్దుపోయి?"

"వకీలు బాబుకు ఎంత కట్టినారు బాబూ?"

"ఎంతోకొంత. రిక్షా కట్టుకొని వేగిరం వెళ్ళిపో" అన్నాను.

మల్లీశ్వరి అట్లాగే నించొన్నది - లేతరంగు చీరతో, తలలో కొత్తగా అప్పుడే వస్తూన్న మల్లెల చెండుతో.

"రాత్రికి ఈడ్నే తొంగుంటాను" అని అతి సహజ మధుర స్వరంతో నా వంక చూసింది. నిశ్శబ్దంలో గూడా చూస్తూనే వున్నది. విద్యుత్కాంతిలో తన అందమంతా వెల్లడిస్తూ నించొన్నది. నన్ను నేను కూడగట్టుకొంటున్న నిశ్శబ్దం.

"నా బాకీని నీ అందంతో తీరుద్దామని వచ్చావు గదూ?"

మాటలేదు.

"నువ్వు నాకేమీ బాకీలేదు. రుణం లేదు. నీవంటి వాళ్ళకు మే మెంతో బాకీ పడివున్నాం - మల్లీ. నీకు చెబితే అర్థమవుతుందో, కాదో. మాది తీరని రుణం. వడ్డీతో పెరుగుతూనే వుంటుంది. మొన్నా అటు మొన్నా నిన్ను హోటలుకు తీసుకెళ్ళింది? తప్పుగా ఆలోచించి, ఏ గతీ లేని నిన్ను యీగదికి తెచ్చేవాడినే. నీ ఆలోచన, విశ్వాసం నా కళ్ళు మూసుకుపోయినవి గూడా తెరిపించగలిగినై? ఎంత మంచి నేర్పావో - గురుత్వం వహించావు. రిక్షాతెస్తాను రా, వెళ్ళిపోదువుగాని"

రిక్షా ఎక్కుతూ నా కాళ్ళకు మొక్కబోతూంటే వారించాను.

"దణ్ణం కూడా యేట్టనీవా బాబూ. కనకమాలచ్మి తల్లి పరీచ్చ యెట్టినాది. నెగ్గింది నువ్వు బాబూ. నానుగాదు" - అన్నది. అవి సినిమా డైలాగుల్లాగా వినిపించలేదు, శోకార్తహృదినుండి మెల్లిగా వినిపించిన కంఠ నాదపు చిరు కెరటాలుగా నా వీనులకు సోకినవి.

రిక్షామనిషి కల్పించుకొని - "పెద్దంతరం సిన్నంతరం కలి కాలంలో సచ్చిపోనాది బాబూ. దణ్ణం పెట్టితే తప్పు నేదు బాబూ!" అంటున్నాడు.

నిశ్శబ్దాన్ని వెనకనేవర్జించి, రాత్రిలో కలిసిపోతూ రిక్షా దూరంగా వెళ్ళిపోయింది.

ఆ తర్వాత నేనూ విశాఖ నుంచి కదిలిపోయాను.

నేనూ మనిషినే నన్న గర్వం కలిగించిన విశాఖ కనక మహాలక్ష్మిని నేనెట్లా మరచి పోగలను?......పోలేను! పోను!! ○

స్వాతి, జూన్ 1987